
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

3
జనగామ
మంగళవారం 6 ఫిబ్రవరి 2024

## రేపు గుడిమెలిగె పండుగ

మేడారం, ఫిబ్రవరి 5: మేడారం మహాజాతరకు అంకురార్పణగా బుధవారం వనదేవతలకు గుడిమెలిగె పండుగను నిర్వహించనున్నారు. ఇందుకోసం పూజారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పూజారులు బుధవారం వేకువజామున లేచి ఇంటిల్లి పాది అటవీ ప్రాంతాలకు వెళ్లి గుట్టగడ్డిని, పుట్ట మట్టిని తీసుకొని వస్తారు. చెప్పులు లేకుండా, ఉపవాసాలు చేసి తల్లుల గద్దెలను శుభ్రంచేస్తారు. అనంతరం డోలి వాయిద్యాల మధ్య గుడిమెలుగు పండుగను కొనసాగిస్తారు. ఈ వేడుకలో పూజారులు వారి కుటుంబసభ్యులతో పాటు గ్రామస్థులు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొననున్నారు.



## వన దేవతలకు ముందస్తు మొక్కులు..

- మేడారానికి భారీగా తరలొస్తున్న భక్తులు
- సుమారు 50వేల మంది భక్తుల రాక

4



నిలువెత్తు బెల్లం(బంగారం)తో వనదేవతల దర్శనానికి వస్తున్న మంత్రులు సీతక్క, ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్

# 6 వేల బస్సులు మహా జాతరకు

- మేడారం జాతరకు 30 లక్షల మందిని తరలించేలా ఏర్పాట్లు
- 18 నుంచి 25 వతేదీ వరకు బస్సు సర్వీసులు
- తల్లుల సన్నిధికొచ్చే మహిళలకు ఉచిత ప్రయాణం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- మంత్రి సీతక్క ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో కలిసి మేడారంలో పర్యటన
- అతివల భద్రతకు వెయ్యి మంది మహిళా పోలీసులను నియమిస్తామని వెల్లడి

ములుగు/మేడారం, ఫిబ్రవరి 5 : తెలంగాణ కుంభమేళగా భావించే గిరిజన జాతరైన మేడారం తరలొచ్చే మహిళా భక్తులకు రాష్ట్రప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ అవకాశాన్ని కల్పిస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఆర్టీసీ ఎండీ వీసీ.సజ్జనార్‌తో కలిసి మేడారం వచ్చిన ఆయన తొలుత ములుగు సమీపంలోని గట్టమ్మ తల్లి, ఇంచర్ల ఎర్రిగట్టమ్మ దేవాలయాలను దర్శించుకున్నారు. అనంతరం మేడారం చేరుకోగా వారికి దేవాదాయ శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. సమ్మక్క, సారలమ్మ, వనదేవతల గద్దెలను దర్శించుకున్న మంత్రులు మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఎత్తు బంగారం(బెల్లం) తులాభారం వేసి దేవతలకు సమర్పించారు. ఈ సందర్భంగా మేడారంలో 55 ఎకరాల్లో ఏర్పాటుచేసిన తాత్కాలిక బస్టాండు, బేస్‌క్యాంపును పరిశీలించారు. తాడ్వాయి వద్ద టికెటింగ్ పాయింట్, కామారం వద్ద ఏర్పాటుచేసిన మూడు పార్కింగ్ పాయింట్లను పరిశీలించారు. అనంతరం హరిత హోటల్‌లో అధికారులతో సమీక్షించారు.

### 30లక్షల మందిని జాతరకు తరలిస్తాం..

ఉచిత బస్సు ప్రయాణ పథకానికి అనూహ్య స్పందన వచ్చిందని, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 14కోట్ల50లక్షల మంది ఆడబిడ్డలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి గమ్యస్థానాలకు చేరారని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఇక ఈ సారి జాతర కోసం అత్యధికంగా 6వేల బస్సులను నడిపిస్తామని, 30లక్షల మంది భక్తులను తరలించేందుకు ఆర్టీసీ తరపున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మేడారం మహా జాతరను విజయవంతంగా జరిపించడంలో ఆర్టీసీది కీలక బాధ్యత అని, భక్తుల చేరవేత, రద్దీ నియంత్రణ, సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టిసారించామన్నారు. ఈనెల 21నుంచి 24వరకు మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర జరుగుతుండగా 18వ తేదీ నుంచే ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించి 25వతేదీ వరకు నడిపిస్తామన్నారు. మొత్తం 51ప్రాంతాల నుంచి బస్సులు మేడారం బయలుదేరుతాయని అన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతీ బస్టాండు నుంచి బస్సులు మేడారం వస్తాయని, ఈసారి ప్రభుత్వం ఆర్టీసీకి రూ.2కోట్ల 25లక్షల నిధులను మంజూరు చేసిందన్నారు. జాతర సమయంలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తుండడంతో మహిళలు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చే అవకాశముందన్నారు. వీరందరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ సంసిద్ధంగా ఉంటుందని వెల్లడించారు. గడిచిన వారం రోజుల్లో మేడారానికి లక్షా 10వేల మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో వస్తే ఇందులో 70వేల మంది మహిళలే ఉన్నారని తెలిపారు. జాతర సమయంలో మేడారంలోని ఆర్టీసీ బస్టాండ్లు, టికెటింగ్ పాయింట్ల వద్ద వెయ్యిమంది మహిళా పోలీసు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. జాతర సమయంలో నార్లాపూర్ చింతల్ క్రాస్ నుంచి మేడారం గద్దెల వరకు ఉచిత సర్వీసులను నడిపిస్తా మన్నారు. క్యూలైన్‌లతోపాటు మరో 15 ఎకరాల్లో మేడారం తాత్కాలిక బస్టాండును విస్తరిస్తామని తెలిపారు. జాతర విధుల్లో పాల్గొనే సిబ్బందికి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యకు జాతరకు ముందే పరిష్కారం లభిస్తుందన్నారు.




నిలువెత్తు బంగారం తూగుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్




మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఆంధ్రజ్యోతి వన-జన జాతర February21-24 2024

## భక్తుల సేవలో 15వేలమంది ఉద్యోగులు : ఆర్టీసీ ఎండీ సజ్జనార్



ఆర్టీసీ సంస్థలోని 15వేల మంది వివిధ స్థాయిల అధికారులు, సిబ్బంది జాతరకొచ్చే భక్తులకు సేవలందిస్తారని, తమ సంస్థ తరపున జాతరను విజయవంతంగా జరిపిస్తామని ఆ సంస్థ ఎండీ వీసీసజ్జనార్ తెలిపారు. మేడారం జాతరను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని, భక్తులకు ఇబ్బంది కలగకుండా చూసుకుంటామన్నారు. 2020 జాతర సమయంలో కొవిడ్ తీవ్రత కారణంగా 11లక్షల మంది మాత్రమే బస్సులలో వచ్చారని, 2022లో 22లక్షల మంది ప్రయాణించారని తెలిపారు. అప్పుడు 3,382బస్సులను నడిపించా మన్నారు. ఈ సారి అత్యధికంగా 6వేల బస్సులను నడిపిస్తున్నావని 16వ తేదీన మేడారంలోని బేస్ క్యాంపును ప్రారంభిస్తామని వెల్లడించారు. 40 ఎకరాల్లో మేడారంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక బస్టాండును 55ఎకరాలకు విస్తరిస్తామన్నారు.

క్యూలైన్‌లలో ఉచితంగా తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. వినోదం కోసం భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మేడారం, పస్రా, గట్టమ్మ పాయింట్ల వద్ద ప్రత్యేక మెకానిక్ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు క్రేన్లు, ట్రాక్టర్‌లను అందుబాటులో ఉంచుకుంటామన్నారు. సిబ్బంది కోసం తాత్కాలిక విశ్రాంతి గదులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ, ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీవో అంకిత్, ఆర్టీసీ సీవోవో రవీందర్, ఈడీలు మునిశేఖర్, కృష్ణకాంత్, రఘునాథరావు, సీటీఎం జీవన ప్రసాద్, సీపీఎం ఉషాదేవి, వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, రంగారెడ్డి ఆర్ఎంలు, డీఎంలు పాల్గొన్నారు.

## జాతీయ పండగగా గుర్తిస్తే మరింత అభివృద్ధి

### జాతర పనులు చివరి దశలో ఉన్నాయి : మంత్రి సీతక్క



మేడారం జాతర పనులు చివరిదశకు చేరుకున్నాయని, జాతీయ రహదారి విస్తరణ, చిన్నచిన్న సీసీ రోడ్ల పనులు మినహా జాతర ఏర్పాట్లన్నీ పూర్తికావచ్చాయని మంత్రి సీతక్క అన్నారు. జాతరకు జాతీయ పండగ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని, ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతిపత్రం సమర్పించానన్నారు. జాతరకు జాతీయ పండగ హోదా వస్తే దేశవ్యాప్తంగా ప్రచారం జరిగి మేడారం ప్రాశస్త్యం అందరికీ తెలుస్తుందని, అభివృద్ధికి కేంద్ర నిధులు వస్తాయని చెప్పారు. కులమతాలు, జాతి వివక్షత లేకుండా అందరినీ కరుణించే చల్లని తల్లులు సమ్మక్క, సారలమ్మలని, తరతమ బేధం లేకుండా అందరూ ప్రకృతి దేవతలను దర్శించుకోవాలని కోరారు. రూ.105కోట్లతో భక్తులకు అన్ని సదుపా యాలు కల్పిస్తున్నామని చెప్పారు. తాగునీరు, శానిటేషన్, భద్రత, ట్రాఫిక్ ప్రధానాంశాలుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమ్మక్క గద్దెపైకి వచ్చే రోజున 2014లో తెలంగాణరాష్ట్ర ఏర్పాటు బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడిందని గుర్తు చేశారు. మహాజాతర జరిగే తేదీలపై సందేహంతో ఇప్పుడే జాతర జరుగుతోందని భావించి పక్కరాష్ట్రాలకు చెందిన భక్తులు తరలివస్తున్నారని సీతక్క తెలిపారు. జాతర తేదీలపై విస్తృత ప్రచారం కల్పించాల్సి ఉందన్నారు. జాతర సమయంలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ సజ్జనార్‌లకు సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

## బాలికపై అత్యాచారం

### నిందితుడిపై పోక్సో కేసు నమోదు

బచ్చన్నపేట, జనవరి 5: బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట మండల సరిహద్దులో గల ఓ గ్రామంలో టీ.నరేష్ అనే యువకుడు రెండు రోజుల క్రితం మాయమాటలతో బాలికను నమ్మించి అత్యాచారం చేశాడు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నర్మెట సీఐ సాయిరమణ, బచ్చన్నపేట ఎస్సై సతీష్ సోమవారం ఆ గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయి విచారణ తర్వాత వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

## విదేశాలలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 5: విదేశాలలో ఉద్యోగాలు చేయాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సీహెచ్.ఉమారాణి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. టామ్‌కామ్ ఆధ్వర్యంలో జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు చేసేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చని, బీఎస్సీ నర్సింగ్ అర్హతతో 22 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వారు టామ్‌కామ్ యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని, దరఖాస్తు దారులకు ఈ నెల 7న సికింద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 99088 30438 నంబరు లో సంప్రదించాలని కోరారు.

## ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 95.58% విద్యార్థుల హాజరు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 5: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం సెషన్‌లో జనరల్, వొకేషనల్ విద్యార్థులతో కలిపి 277 మందికి గాను 259 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 221 మంది విద్యార్థులకు 217 మంది హాజరయ్యారు. మొత్తం 498 మంది విద్యార్థులకు 476 మంది (95.58 శాతం) హాజరైనట్లు డీఐఈవో భైరి శ్రీనివాస్ తెలిపారు. కాగా జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఏబీవీ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను డీఐఈవో భైరి శ్రీనివాస్, డెక్ సభ్యులు కె.ఆంజనేయ రాజు సందర్శించారు.

## దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలి

### - ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ శివలింగయ్య



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ టౌన్, ఫిబ్రవరి 5: ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మంది నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఇందులో రెవెన్యూ శాఖ పరిధిలోనివే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై ఆరా తీశారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రధానంగా పంట నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ చిలుపూర్ మండలకేంద్రానికి చెందిన రైతు మూల సంపత్ వినతిపత్రం ఇచ్చారు. వారసత్వ భూమి రిజిస్ట్రేషన్ కోసం లింగాలఘణపురం మండలం వనపర్తి గ్రామానికి చెందిన మేకల ప్రశాంత్ అర్జీ పెట్టుకున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కల పెంపకం కోసం డ్రిప్ మంజూరు చేయాలని కోరుతూ కొడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన విజయ దరఖాస్తు అందజేశారు. ఎత్తిపోతల పథకం కింద రిజర్వాయర్ నిర్మాణంలో తన ఇల్లు ముంపునకు గురైందని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ లింగాలఘణపురం మండలం నవాబుపేట గ్రామానికి చెందిన రాధాబాయి అర్జీ పెట్టుకున్నారు.

ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు రోహిత్‌సింగ్, పర్మర్ పింకేశ్‌కుమార్, ఆర్డీవో మురళీకృష్ణ, డీఆర్‌డీవో మొగులప్ప, సీపీవో ఇస్మాయిల్, డీఈవో రాము, డీపీవో రంగాచారి, డీడబ్ల్యూవో జయంతి తదితరులు పాల్గొన్నారు.

### పింఛన్ ఆగిపోయింది..

**- భాస్కుల రాజమ్మ, సిరిసన్నగూడెం, పాలకుర్తి మండలం**



నాకు ఒక కాలు పనిచేయడం లేదు. నాలుగేళ్ల క్రితం భర్త చనిపోయాడు. నా వయస్సు 70 సంవత్సరాలు. నేను దివ్యాంగ, వితంతు, వృద్ధాప్య పించన్లకు అర్హురాలిని. కానీ నాకు ఎలాంటి పింఛన్ రావడం లేదు. నాలుగేళ్ల కిందటి వరకు దివ్యాంగ పింఛన్ వచ్చింది. ఆ తరువాత ఆగిపోయింది. పింఛన్ ఇస్తే తప్ప బతకలేని పరిస్థితిలో ఉన్నా. అధికారులు న్యాయం చేయాలి.

### భూమి ఆక్రమణ జరుగకుండా చూడాలి..

**- బొలగం చంద్రశేఖర్, చీటకోడూరు, జనగామ మండలం**



చీటకోడూరు గ్రామంలో 367 సర్వే నంబర్‌లో కాల్వకు సంబంధించి 20 గుంటల భూమిని ఓ వ్యక్తి కబ్జా చేశాడు. దాని చుట్టూరా ఉన్న మరింత ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ భూమిని అధికారులు ఆధీనంలోకి తీసుకోవాలి.

## బుద్ధుందా.. ఆఫీసుకు తాగొస్తావా?

### రిపీట్ అయితే సస్పెండ్ చేస్తా..

### కార్మికశాఖ అధికారిపై కలెక్టర్ ఫైర్


జనగామ టౌన్, ఫిబ్రవరి 5 : మద్యం తాగి కార్యాలయానికి వచ్చిన ఓ జిల్లా అధికారిపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఇలా చేస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ఈ సంఘటన సోమవారం జనగామ కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కార్మిక శాఖకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన సీఐటీయూ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, తదితర నాయకులు.. కార్మికశాఖకు సంబంధించిన వందలాది ఫైళ్లు పేరుకుపోయినా జిల్లా అధికారి కుమారస్వామి పట్టించుకోవడం లేదంటూ కలెక్టర్ శివలింగయ్యకు ఫిర్యాదు చేశారు. దీనిపై వివరణ కోరేందుకు కుమారస్వామిని కలెక్టర్ పిలిచారు. కానీ ఆయన గ్రీవెన్స్‌లో అందుబాటులో లేరు. దీంతో సదరు అధికారి ఎప్పుడూ గ్రీవెన్స్‌కు రారని, కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తితో పని చేయిస్తారని, ఆయన మద్యం మత్తులోనే విధులకు హాజరవుతారని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. అందుకు స్పందించిన కలెక్టర్ వెంటనే ఆయనను పిలిపించాలని అక్కడున్న అధికారులకు సూచించారు. ఆ తర్వాత కొద్దిసేపటికి గ్రీవెన్స్ నుంచి కలెక్టర్ బయటికి వెళ్తుండగా సదరు కార్మిక శాఖ అధికారి ఎదురవడంతో.. కలెక్టర్ ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలోనూ సదరు అధికారి మద్యం మత్తులో ఉండడంతో అక్కడున్న వారంతా అవాక్కయ్యారు. 'ఇప్పుడు కూడా తాగొచ్చావా?' అంటూ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆరోగ్యం బాగా లేదని, కొంచెం మద్యం తాగొచ్చానని ఆ అధికారి వింత సమా ధానం ఇచ్చారు. దీంతో కలెక్టర్ ఆయనపై మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. 'దిస్ ఈజ్ ఫైనల్ వార్నింగ్.. రిపీట్ అయితే సస్పెండ్ చేస్తా.. పేరుకుపోయిన ఫైళ్లు వెంటనే క్లియర్ చెయ్' అంటూ వార్నింగ్ ఇచ్చి అక్కడినుంచి వెళ్లిపోయారు.



జిల్లా కార్మిక శాఖ అధికారి కుమారస్వామిని హెచ్చరిస్తున్న కలెక్టర్

## నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు

- మెగా డీఎస్సీకి సీఎం హామీ ఇవ్వడంతో యువత హర్షం
- జిల్లాలో 447 పోస్టులు ఖాళీలు



నర్మెట, ఫిబ్రవరి 5: ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏళ్ల తరబడి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు మళ్లీ పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో కృషి చేస్తున్నారు.

### ఎన్నికల కారణంగా వాయిదా..

గత ప్రభుత్వం 2017లో నిర్వహించిన టీఆర్టీ తర్వాత ఇప్పటివరకు డీఎస్సీ నిర్వహించలేదు. గతేడాది సెప్టెంబరు 15న టెట్ నిర్వహించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అంతకు ముందే సెప్టెంబరు 6న డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి నవంబరు 25 నుంచి 30 వరకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించింది. ఈలోగా ఎలక్షన్ కోడ్ రావడంతో పరీక్షలు నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటన చేయడంతో బీఈడీ, డీఈడీ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేలాది మంది అభ్యర్థులు టెట్ ఉత్తీర్ణత సాధించి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు.

### కోచింగ్ సెంటర్ల బాట పడుతున్న నిరుద్యోగులు..

మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లు బాట పడుతున్నారు. 2017 తర్వాత ఇంతవరకు డీఎస్సీ నిర్వహించలేదు. ఏడేళ్ల తర్వాత ఉపాధ్యాయ ఖాళీల భర్తీపై ప్రకటన రావడంతో నిరుద్యోగులు ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో సిద్ధమవుతున్నారు.

### జిల్లాలో 447 ఖాళీలు..

జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు పెరిగే అవకాశం ఉంది. సుమారు 10 వేలకు పైగా అభ్యర్థులు టెట్ అర్హత సాధించి ఉన్నారు.



గతంలో జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో జనగామ జిల్లాలో 76 పోస్టులు మాత్రమే ఉన్నాయి. దీంతో అభ్యర్థులు నిరాశకు లోనయ్యారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వివిధ సబ్జెక్టుల్లో 447 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో సుమారు 211 పోస్టులు ప్రమోషన్ల ద్వారా భర్తీ కానుండగా మిగిలిన 230 పోస్టులు నూతన అభ్యర్థులతో భర్తీ కానున్నాయి. దాంతో పాటు 6 వొకేషన్‌నల్ పోస్టులు ఉన్నాయి. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో ఖాళీలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. జనగామ జిల్లాలో 12 మండలాల్లో 103 ఉన్నత పాఠశాలలు, 341 ప్రాథమిక, 64 ప్రాథమికోన్నత కలిపి మొత్తం 508 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 2125 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గెజిటెడ్ హెచ్‌ఎంలు 64, పీఎస్ హెచ్‌ఎంలు 58, ఎస్జీటీలు 118, ఎస్‌ఏ మాథ్స్ 22, ఫిజిక్స్ 9, బయోసైన్స్ 39, సోషల్ 55, ఎస్‌ఏ తెలుగు 14, హిందీ 8, ఇంగ్లీష్ 21, ఫిజికల్ డైరక్టర్ 5, లాంగ్వేజ్ పండిట్ తెలుగు 12, లాంగ్వేజ్ పండిట్ హిందీ 9, పీఈటీ 7, వొకేషనల్ 6 మొత్తం 447 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం ద్వారా జిల్లాలో ఉపాధ్యాయుల కొరత తీరనుంది.

### నోటిఫికేషన్ త్వరగా విడుదల చేయాలి..

**- ఆర్.రామ్మోహన్‌రెడ్డి బీఈడీ, డీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**



మెగా డీఎస్సీ ప్రకటనతో బీఈడీ, డీఈడీ అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి. త్వరలో ఎంపీ ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఖాళీలను భర్తీ చేయాలి.

## గెస్ట్ లెక్చరర్లను ఎంటీఎస్‌లో చేర్చాలి

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 5: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లను ప్రభుత్వం గుర్తించి మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్)లో చేర్చాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.యాదయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జనగామ జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన గెస్ట్ లెక్చరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1654 మంది గెస్ట్ లెక్చరర్లు పని చేస్తున్నారన్నారు. సంవత్సరం పొడవునా పని చేస్తే 8 నుంచి 9 నెలల వేతనం మాత్రమే ఇస్తున్నారన్నారు. ఆకలితో అలమటిస్తూ అతిథి అధ్యాపకులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం గుర్తించి గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.42 వేల నెలసరి వేతనం 12 నెలల పాటు చెల్లించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా తమను ఎంటీఎస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు జి.స్రవంతి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.సింధూజ, ఝాన్సీ, వసీమా, టి.రాజు, సతీష్, దేవేందర్, ఇస్హాక్, ఉదయ్, జ్యోతి, మధు తదితరులు పాల్గొన్నారు.


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


జంపన్నవాగులోని పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు


మేడారం పరిసరాల్లో విడిది ఏర్పాటు చేసుకుంటున్న భక్తులు

# తల్లులకు ముందస్తు మొక్కులు..

**మేడారానికి భారీగా తరలొస్తున్న భక్తులు**

మేడారం, ఫిబ్రవరి 5 : వనదేవతలకు భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. తెలంగాణ కుంభమేళగా భావించే సమ్మక్కసారలమ్మ జాతరకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని పలుజిల్లాల నుంచి భారీగా జనం తరలొస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సుమారు 50వేల మంది భక్తులు వనదేవతల గద్దెలను సందర్శించారు. జంపన్నవాగులో పుణ్యస్నాలు ఆచరించి తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం గద్దెల ప్రాంగణంలో పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించారు. యాట మొక్కులతో తల్లుల గద్దెలు దద్దరిల్లేలా సమ్మక్క-సారలమ్మలకు జేజేలు పలికారు. ఇక రోజురోజుకు అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు.

## రేపు, ఎల్లుండి రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు

హనుమకొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 5 : తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు హఫీజ్‌ఖాన్, కరీంలు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15, 20 బాల బాలకల విభాగాల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 11 నుంచి 17 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఈ నెల 7న ఉదయం 8 గంటలకు జేఎన్ ఇండోర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని వారు సూచించారు. వివరాలకు సెల్ 81066 23230 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

సుబేదారి, ఫిబ్రవరి 5: క్రీడలు విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎల్బీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు అన్నారు. ఎల్బీ కళాశాల వార్షిక క్రీడా దినోత్సవం, కళాశాల గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌ను పురస్కరించుకుని సోమవారం కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. క్రికెట్ ఆడి ఈ క్రీడలను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ డిపార్ట్‌మెంట్లలో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు పొందటానికి రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ రిజర్వేషన్స్ కల్పించిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుతూనే క్రీడల్లోనే రాణించాలన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి. ప్రభాకర్ మాట్లాడుతూ క్రికెట్, కబడ్డీ, ఖో-ఖో, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ బాస్కెట్‌బాల్ తదితర క్రీడలను బాలురకు, బాలికలకు వేరువేరుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. రాజేందర్ రెడ్డి, గేమ్స్ కమిటీ సభ్యులు రాజేశ్వర్‌రావు, బి. శృతి, బి. రజిని పాల్గొన్నారు.

## 'అవకాశమిస్తే ఎమ్మెల్సీగా బరిలో ఉంటా'

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 5 : బీఆర్ఎస్ అధిష్ఠానం అవకాశం ఇస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలుస్తానని, న్యాయవాదులు ఓటు నమోదు చేసుకోవాల నివికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదులో భాగంగా సోమవారం వాసుదేవరెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదులను కలిసి ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రెండో రోజూ బిహార్ ఎమ్మెల్యేల క్యాంపు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని కాగజ్‌గట్ సిరి నేచర్స్ వ్యాలీ రిసార్టులో.. బిహార్ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్యాంపు రెండురోజూ కొనసాగింది. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను చూసుకుంటున్నారు. రిసార్టు పరిసరాలకు ఇతరులెవరూ రాకుంట కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. 12న బిహార్ అసెంబ్లీలో అక్కడి సీఎం నితీశ్ విశ్వాసపరీక్ష ఎదుర్కోనున్న నేపథ్యంలో 11వ తేదీ వరకు ఈ క్యాంపు కొనసాగనున్నట్లు తెలిసింది.



# బాల్క సుమన్‌పై కేసు నమోదు

- సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పోలీస్‌స్టేషన్లలో కాంగ్రెస్ ఫిర్యాదులు
- ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు: వివేక్
- స్థాయి మరిచి మాట్లాడుతున్నడు: సంపత్
- తన్ని తరిమే పరిస్థితి తెచ్చుకోవద్దు: అద్దంకి
- గుండు కొట్టి ఊరేగిస్తాం: దయాకర్ గౌడ్

దిల్‌సుఖ్‌నగర్/మంచిర్యాల/దండేపల్లి/హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు నమోదైంది. బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నాయకుడు పూదరి తిరుపతి నేతృత్వంలో సోమవారం రాత్రి మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన పోలీసులు.. బాల్క సుమన్‌పై 294-బి, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లోనూ రెడ్డి సంఘం కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి ఆయనపై ఫిర్యాదు చేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తిని కించపరిచే విధంగా వ్యాఖ్యానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, బాల్క సుమన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు ఫైర్ అయ్యారు. సుమన్ సంస్కారం లేకుండా మాట్లాడారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ధ్వజమెత్తారు. కేటీఆర్.. తన వెంట తిరిగే కుక్కను సీఎంపై ఉసిగొల్పాడని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఇప్పటికే మడతపెట్టారన్నారు. ఓటమి మంచికేనంటూ కేటీఆర్ మాట్లాడుతున్నారని, ఆయనకు జీవితకాలం మంచే జరగాలని ఆ దేవుడుని కోరుకుంటున్నానన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఓటమి ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారని, తన్ని తరిమేసే పరిస్థితి తెచ్చుకుంటున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. ఇలాంటి చిల్లరగాళ్ల మాటలను పట్టించుకోవద్దని ప్రజలకు సూచించారు. కేటీఆర్ అండ్ టీమ్.. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. బాల్క సుమన్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడితే మంచిదని.. రేవంత్‌రెడ్డిపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే గుండు కొట్టించి గాడిదపై ఊరేగిస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ హెచ్చరించారు. అమాయక విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న నీచుడు బాల్క సుమన్ అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారుగొండ వెంకటేష్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతా చారి, వేణుగోపాల్‌రెడ్డి చావుకు ఆయనే కారణమన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాశ్ నేత మాట్లాడుతూ సీఎం రేవంత్‌కు బాల్క సుమన్ చెప్పు చూపిస్తే.. తెలంగాణ ప్రజలు ఆయన్ను బట్టలూడదీసి కొడతారన్నారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ సూచించారు. దిగజారి మాట్లాడటం సరైందికాదని హితవు పలికారు. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో బాల్క సుమన్ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించి, దహనం చేశారు. అలాగే, చెన్నూరు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు.

# రేవంత్ జూటా సీఎం

(మొదటిపేజీ తరువాయి)



సమావేశంలో రాష్ట్ర అధికారులే చెప్పారు. అదే విషయాన్ని ఈఎన్‌సీ ప్రకటించారు. నెల రోజుల్లో ప్రాజెక్టులను అప్పగించాలని, సీఆర్‌పీఎఫ్ అనుమతితోనే ప్రాజెక్టుల వద్దకు ఇంజినీర్లు వెళ్లాలని, నిర్వహణ బాధ్యత రెండు రాష్ట్రాలదని పేర్కొంటూ ఆ తర్వాత కేంద్రం వెల్లడించిన మినిట్స్‌లోనూ ఉంది. దీనిపై 19న నేను ప్రెస్‌మీట్ పెట్టి ప్రశ్నించే వరకూ మంత్రులకు సోయి లేదు. ప్రాజెక్టులను అప్పగిస్తే రాష్ట్రానికి నష్టం కలుగుతుందని.. అప్పుడు గుర్తించారు. పదేళ్లలో కేఆర్‌ఎంబీకి తాము ఏ ప్రాజెక్టునూ అప్పగించలేదు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల్లోనే ప్రాజెక్టులను ఢిల్లీ చేతిలో పెట్టి అడుక్కు తినే పని చేశారు" అని విమర్శించారు. ఇదంతా నిజం కాకుంటే ఉద్యోగులు, వారి జీతాల చెల్లింపు వరకు చర్చ ఎందుకు వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేఆర్‌ఎంబీకి చెందిన 16, 17వ సమావేశాల్లో తెలంగాణ ఒప్పుకోలేదని మినిట్స్ కాపీలోనే ఉందంటూ.. అందులోని అంశాలను చదివి వినిపించారు. ఆ సమావేశానికి హాజరు కాని అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా ఎలా సంతకాలు చేస్తారని ప్రశ్నించారు. తప్పును ఒప్పుకోకుండా.. గత ప్రభుత్వమే ఒప్పుకొందంటూ అబద్ధాలు చెబుతున్నారని.. ఇంతకన్నా జుటా సీఎం ఎవరైనా ఉంటారా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌కు స్క్రిప్ట్ రాసిస్తున్న వారు అబద్ధాలనే రాసిస్తున్నారని, ఆయన్ను తప్పుదోవ పట్టించకుండా సరైన సమాచారం ఇస్తే బాగుటుందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించి రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెట్టొద్దని కోరారు. రేవంత్ అబద్ధాలకు తాను ఇస్తున్న వివరణ శాంపిల్ మాత్రమేనని, అసెంబ్లీ వేదికగా ప్రజలకు వాస్తవాలు చెబుతామని, పూర్తి సినిమా ముందుందన్నారు. కాంగ్రెస్ నేతలు కూడా ప్రిపేర్ అయి రావాలని, గతంలో మాదిరిగా అడ్డంగా దొరికిపోయే పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు.

### రాయలసీమ లిఫ్ట్‌ను వ్యతిరేకించాం

పోతిరెడ్డిపాడు విషయంలో పదవులకు ఆశపడి పెదవులు మూసుకున్నారంటూ రేవంత్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని హరీశ్ స్పష్టం చేశారు. 2005 జూలై 4న తాము మంత్రి పదవులకు రాజీనామా చేసి కాంగ్రెస్ సర్కారు నుంచి బయటకు వచ్చామని, అదే ఏడాది సెప్టెంబర్ 13న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడుపై జీవో తెచ్చిందన్నారు. పదవుల కోసం పార్టీలు మారిన చరిత్ర రేవంత్‌దని, ఉల్టా చోర్ కొత్వాల్ కే డాంటే లాగా తమపై నిందలు వేయడం తగదన్నారు. రాయలసీమ లిఫ్ట్‌ను కేసీఆర్ వ్యతిరేకించారని, రెండో అపెక్స్ కమిటీ మీటింగ్‌లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించారని గుర్తు చేశారు. ప్రాజెక్టులు ఇచ్చింది ఎవరు.. ఎవర్ని చెప్పులతో కొట్టాలో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పెద్దలే విభజన చట్టం రూపొందించారని, బిల్లులోని అంశాల గురించి తెలుసుకోకుండా వితండవాదం చేయడం తగదన్నారు. మితిమీరిన అహంకారం, అబద్ధాలు, సంస్కారం లేని భాష, వికారమైన ధోరణి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో కనిపించాయని హరీశ్ ధ్వజమెత్తారు. కేసీఆర్ పట్ల నీచమైన భాషలో దూషణలకు పాల్పడ్డారన్నారు. ఆయన ధోరణి చూసి ఒక సీఎం ఇలా మాట్లాడతారా? అని తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. కాగా, ఉమ్మడి రాష్ట్రంలోనే నీళ్లు బాగుండేవని, తెలంగాణ వచ్చాక అన్యాయం జరిగిందని మంత్రి ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలు అమరుల త్యాగాలను తప్పుపట్టేలా ఉన్నాయని హరీశ్ ఆరోపించారు. నాడు కాంగ్రెస్ పాలనలో జరిగిన అన్యాయాలను తమ ప్రభుత్వం సరి చేసిందని పేర్కొన్నారు.

# చెత్త సీఎంను చెప్పుతో కొడతా

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్
- చెప్పు చూపిస్తూ పరుష పదజాలంతో దూషణ
- మాకూ ముతక కూతలు వస్తాయి: జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



రండ పనులు చేసింది మీరు.. అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నేతలు ఘాటుగా స్పందించారు. రేవంత్‌ను ఉద్దేశించి ప్రచురించలేని భాషలో దుర్భాషలాడారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పరుష పదజాలంతో దూషించారు. చెత్త సీఎం రేవంత్‌ను చెప్పుతో కొడతానంటూ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చెప్పు చూపిస్తూ తీవ్ర పదజాలంతో దుర్భాషలాడారు. మంచిర్యాల, పెద్దపల్లిలో ఆయన మాట్లాడారు. "కాలం కలిసొచ్చి అందలమెక్కావ్.. నీ అదృష్టమో, తెలంగాణ ప్రజల దురదృష్టమో ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నవ్. గతంలో చిల్లర మాటలు మాట్లాడిన నువ్వు.. ఇప్పుడు ముఖ్యమంత్రి స్థాయిలో పద్ధతిగా మాట్లాడాలె. పదేళ్లపాటు తెలంగాణను బ్రహ్మాండంగా అభివృద్ధి చేసిన నాయకుడు కేసీఆర్‌ను తిడితే ఊరుకోం.. చెప్పుదీసి కొడుతా.. ఖబడ్దార్" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో పది మంది ముఖ్యమంత్రులు ఉన్నారని, ఎప్పుడు ఎవడు కుర్చీ లాగుతాడో, ఎవరు అంగీ లాగు లాగుతాడో తెలియని పరిస్థితి ఉందన్నారు. అదానీని రాహుల్ గాంధీ విమర్శిస్తే, రేవంత్ రెడ్డి దావోస్ వెళ్లి రూ.12 వేల కోట్ల పెట్టుబడులకు ఎలా అంగీకరించారని ప్రశ్నించారు. ఇప్పటిదాకా రైతు బంధు డబ్బులు వేయని ప్రభుత్వం.. కాంట్రాక్టర్లకు బిల్లులు మాత్రం చెల్లించిందని మండిపడ్డారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సైతం పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లించారన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాల గూడలో మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ హామీలు అమలు చేయలేని రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌పై నెపం వేసి తప్పించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ నాయకులను ప్రజలే వెంటబడి చెప్పులతో కొడతారన్నారు. నిండా మూడు పీట్లు లేని సీఎం.. ఎమ్మెల్యే కంటే హీనంగా మాట్లాడుతున్నారన్నారు. తిట్టదలుచుకుంటే.. తమకూ మరిన్ని ముతక కూతలు వస్తాయని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టుపైకి ఏపీ పోలీసులు దండెత్తి వచ్చారని, కోడ్ అమలులో ఉండడంతో అప్పటి సీఎం కేసీఆర్ అధికారులకు ఆదేశాలు ఇవ్వలేకపోయారని తెలిపారు. యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎం అనే విషయాన్ని మరిచిపోయారని, ఇంకా టీపీసీసీ అధ్యక్షుడిలాగే వ్యవహరిస్తునానరని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. "ప్రభుత్వ అసమర్థతను, చేతగానితనాన్ని ప్రశ్నిస్తే వంద గజాల లోతున బీఆర్‌ఎస్‌ను బొంద పెడతావా? బీఆర్‌ఎస్‌ను బొంద పెట్టేటోళ్లు.. ఇకపైనా పుట్టబోరు. కేసీఆర్‌నే అసభ్య పదజాలంతో దూషిస్తావా.. బుద్ధి ఉందా నీకు" అని నిలదీశారు. రేవంత్ మాట తీరు ఇలాగే ఉంటే తెలంగాణ ప్రజలు ఆయనకు ఘోరీ కట్టడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే ప్రాజెక్టుల అప్పగింతకు ఒప్పందం చేసుకున్నారని, వచ్చే ఐదేళ్లలో తెలంగాణను ఏపీలో కలిపినా కలిపేస్తారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. పెద్దపల్లిలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒప్పుకోలేదని స్పష్టం చేశారు.



నేడు తెలంగాణభవన్‌కు

## మాజీ సీఎం కేసీఆర్

- కృష్ణానది పరివాహక జిల్లాల నేతలతో సమావేశం
- కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించడంపై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ కార్యాలయానికి వచ్చిన బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు.. ఫలితాల వెల్లడి తర్వాత తొలిసారి మంగళవారం రానున్నారు. ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో కాలు జారడంతో ఆయనకు తుంటి శస్త్రచికిత్స చేసిన విషయం విదితమే. దాన్నుంచి కోలుకున్న కేసీఆర్.. ఈ నెల 2న గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. అదేరోజు నందినగర్‌లోని తన నివాసంలో పార్టీ నేతలతో సమావేశమయ్యారు. మంగళవారం తెలంగాణ భవన్‌కు రానున్నారు. ఈ సందర్భంగా కృష్ణానది పరివాహక జిల్లాలకు చెందిన వారితోపాటు బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశమవుతారు. నాగార్జున సాగర్, శ్రీశైలం సహా కృష్ణానది మీద ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడాన్ని ఖండిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న రైతు వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లో ఎండగట్టేందుకు ఏం చేయాలన్న దానిపై ఆయన చర్చిస్తారు. అంతేకాకుండా కేఆర్‌ఎంబీ పరిధిలోకి ప్రాజెక్టులను తీసుకువెళ్లడాన్ని నిరసిస్తూ.. త్వరలోనే నల్గొండలో చేపట్టనున్న భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు, ఇతర కార్యాచరణపై పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

నేడు మేడిగడ్డను సందర్శించనున్న

## కర్ణాటక ఎమ్మెల్యేలు!

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 5 : కర్ణాటక అసెంబ్లీ స్పీకర్‌తో పాటు 11మంది ఎమ్మెల్యేల బృందం నేడు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు విశ్వసనీయవర్గాల ద్వారా సమాచారం అందింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగానే మేడిగడ్డ బ్యారేజీతో పాటు కన్నెపల్లి పంప్‌హౌస్, మహదేవపూర్ ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయాల్లోనూ ఇప్పటికే రెండు విడతలుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ తనిఖీలు నిర్వహించింది. కాగా, విజిలెన్స్ ఇంకా ప్రభుత్వానికి నివేదిక అందించకముందే కర్ణాటక స్పీకర్, ఎమ్మెల్యేలు మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు రానుండడం చర్చనీయాంశంగా మారింది.

# కేసీఆర్, జగన్ కుట్రతోనే సాగర్ ఆక్రమణ

**పోలింగ్‌ను ప్రభావితం చేసే కుట్ర దాగుంది..కృష్ణా ప్రాజెక్టుల్ని బోర్డుకు అప్పగించే ప్రసక్తేలేదు: ఉత్తమ్**



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేయాలన్న కేసీఆర్-జగన్ కుట్రలో భాగంగానే.. తెలంగాణలో పోలింగ్ రోజున నాగార్జున సాగర్ డ్యామ్‌ను ఏపీ పోలీసులు ఆక్రమించారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. జగన్, కేసీఆర్ మాట్లాడుకున్నాకే.. ఎన్నికల్లో కేసీఆర్‌కు రాజకీయ ప్రయోజనం కల్పించడానికే గత ఏడాది నవంబరు 29న సాగర్ ఆక్రమణ జరిగిందని ఆయన ఆక్షేపించారు. సచివాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడిన మంత్రి.. కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించబోమని, అలాంటి ఆలోచనే లేదని తేల్చిచెప్పారు. హరీశ్‌రావులాగా పెట్రోల్ పోసుకొని నాటకాలాడి.. ఇంకొకరి ఆత్మహత్యకు తామెప్పుడూ కారణం కాలేదని స్పష్టంచేశారు. "మీరు ఉద్యమ సమయంలోనే బ్లాక్‌మెయిలర్లు. ఆ లెక్కలు బయటపెట్టాలా?" అన హరీశ్‌రావును ఉద్దేశించి మంత్రి నిప్పులు చెరిగారు. తెలంగాణ రావడానికి నాడు కేంద్ర హోం మంత్రిగా చిదంబరం నిర్వహించిన అఖిలపక్ష సమావేశమే కారణమని, ఆ భేటీ అనంతరం కేంద్రాన్ని ఒప్పించి, తెలంగాణ ఏర్పడటానికి చిదంబరం చేసిన ప్రయత్నాలు కీలకమని గుర్తుచేశారు. "ఈ విషయం నీకు (హరీష్‌రావు) తెలియకుంటే.. నీ మామను అడుగు" అని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కన్నా తెలంగాణ ఏర్పడ్డాక, టీఆర్‌ఎస్ పాలనలోనే తెలంగాణకు కృష్ణా జలాల విషయంలో అన్యాయం జరిగిందని మంత్రి ధ్వజమెత్తారు. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను అప్పగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరాలూ లేవని 16వ కృష్ణాబోర్డు సమావేశంలో చెప్పింది టీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని.. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలన్నీ టీఆర్‌ఎస్ ఒప్పందం చేసుకుందని, రైతాంగానికి, ప్రజలకు అన్యాయం చేసిందే టీఆర్‌ఎస్ అని మంత్రి దుయ్యబట్టారు. ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రిబ్యునల్ 811 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయించగా.. అందులో ఏపీకి 66 శాతం(512 టీఎంసీలు), తెలంగాణకు 34 శాతం(299 టీఎంసీలు) కేటాయింపుపై 2015లో టీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఒప్పందం చేసుకుందని, ఆ అన్యాయం పదేపదే కొనసాగిందని మండిపడ్డారు. 2023-24 బడ్జెట్ డిమాండ్ బుక్‌లో తెలంగాణ పాలసీ ప్రకటనలో భాగంగా శ్రీశైలం, నాగార్జునసాగర్‌ను కృష్ణాబోర్డుకు, పెద్దవాగు ప్రాజెక్టును గోదావరి బోర్డుకు అప్పగించడానికి నిర్ణయం తీసుకున్నట్లు శాసనసభలో ప్రకటించిందని గుర్తుచేశారు. అంతేకాక.. ఆయా ప్రాజెక్టుల నిర్వహణ కోసం సీడ్ మనీ కింద బోర్డులకు చెరో రూ.200 కోట్లను ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించిందని.. ఇప్పుడు అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆక్షేపించారు. తాము మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసి 56 రోజులైందని.. ఈ 56 రోజుల్లో ప్రాజెక్టుల అప్పగింతపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖపై శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.

### ఏకాంత చర్చల ఫలితమే..

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు జగన్‌తో జరిపిన ఏకాంత చర్చల తర్వాతే.. శ్రీశైలం నుంచి రోజూ 8 టీఎంసీల తరలింపుపై రాయలసీమ ఎత్తిపోతల పథకం జీవో విడుదలయిందని ఉత్తమ్ గుర్తుచేశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కాకుండా.. రాయలసీమ టెండర్లు ఖరారయ్యాకే కేసీఆర్ అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే.. పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ కృష్ణా బేసిన్‌లోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని, పాలమూరు-రంగారెడ్డి నిర్మాణ అంచనాలు పెంచుకుంటూ పోయారని, ఈ ప్రాజెక్టులో రూ.27500 కోట్లు ఖర్చుపెట్టినా ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేదని నిప్పులు చెరిగారు. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్‌తో పాటు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్ ప్రాజెక్టులను కూడా పూర్తిచేయలేదని ఉత్తమ్ మండిపడ్డారు.

# ఆర్టీసీ ఆదాయానికి గండి!

## కొన్నేళ్లుగా పేరుకుపోయిన లీజు బకాయిలు

- ఏటా రావాల్సింది 100కోట్లపైనే
- సగం కూడా వసూలు చేయని పరిస్థితి
- బీఆర్‌ఎస్ హయాంలో ఒత్తిళ్లే కారణం
- కాంగ్రెస్ వచ్చాక లీజుదారులకు నోటీసులు
- లీజులు రద్దు, స్థలాల స్వాధీనానికి యత్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పాలకుల నిర్లక్ష్యానికితోడు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండి పడింది. లీజు బకాయిల వసూళ్లు చేపట్టకుండా అధికారులను నియంత్రించడంతో ఆర్టీసీ ఖజానాకు రావాల్సిన కోట్లాది రూపాయల నిధులు నిలిచిపోయాయి. టికెట్ చార్జీల చెల్లింపుల్లో కేవలం రూ.10 వ్యత్యాసం వస్తేనే కండక్టర్లను సస్పెండ్ చేసే యాజమాన్యం.. లీజుదారుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేయకుండా ఏళ్ల తరబడి నుంచి చోద్యం చూడడంలో అంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్లలోని స్టాళ్లను అద్దెకు ఇవ్వడం, స్థలాలను లీజుకు ఇవ్వడం ద్వారా ఆర్టీసీకి ఏటా 100 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. కానీ, గత బీఆర్‌ఎస్ పాలకుల నిర్లక్ష్య ధోరణి... కారణంగా సగానికిపైగా ఆదాయం నిలిచిపోయినట్టు తెలిసింది.

### కొన్ని ఉదాహరణలు..

గ్రేటర్ హైదరాబాద్ రీజియన్‌లో సిటీ బస్సుల్లో వాణిజ్య ప్రకటనల కోసం ఆర్టీసీతో గో రూరల్ ఇండియా సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. 2015 సెప్టెంబరు నుంచి 2021 సెప్టెంబరు వరకు రూ.22కోట్లు చెల్లించాలి. కానీ, గడువులోగా బకాయిలను వసూలు చేయడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. హైదరాబాద్ రీజియన్‌కు రూ.10.75 కోట్లు, సికింద్రాబాద్ రీజియన్‌కు రూ.10.98 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. గడువులోగా చెల్లించని పక్షంలో ఒప్పందాన్ని రద్దు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోకుండా అప్పటి అధికారపార్టీ నేతలు అడ్డుపడినట్టు తెలిసింది. ఇక, ఎంజీబీఎస్‌లో స్టాళ్ల కేటాయింపులో సైతం అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదులున్నాయి. ఆర్టీసీ కళామండపం లీజు విషయంలోనూ ఇదే తంతు చోటు చేసుకుంది. ఏళ్ల తరబడి నిర్వహణ బాధ్యతలు పొందిన అధికార పార్టీ నేతలు సుమారు రూ.8కోట్లకుపైగా ఎగవేసినట్టు అధికారులు తెలిపారు. ఇక, నిజామాబాద్‌లో ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకుని వాణిజ్య సముదాయాన్ని నిర్మించి, అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్న రాజకీయ నాయకుడిపై చర్యలు తీసుకోవడంలో ఆర్టీసీ విఫలమైందన్న ఆరోపణలున్నాయి. కరీంనగర్, నల్లగొండ, రాణిగంజ్, మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లోని స్థలాలు, భవనాల లీజుదారుల నుంచి భారీ మొత్తంలో బకాయిలు రావాల్సి ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. తాజాగా బీఆర్‌ఎస్ గద్దె దిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆర్టీసీ అధికారులు రంగంలోకి దిగారు. బకాయిల వసూళ్ల కోసం లీజుదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. లీజుదారులు స్పందించని పక్షంలో ఒప్పందాలను రద్దు చేసి, స్థలాలు, నిర్మాణాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

## ప్రత్యేక అధికారులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

**కలెక్టర్ శివలింగయ్య**


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ టౌన్, ఫిబ్రవరి 5: సర్పంచ్‌ల పాలన ముగిసినందున గ్రామాల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ శివలింగయ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఎన్ని ఇండ్లకు ఎన్ని లీటర్ల మిషన్ భగీరథ నీరు అందుతుందో రిజిస్టర్ చేయాలన్నారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. ఇల్లు, నల్లా పన్నులను క్రమం తప్పకుండా వసూలు చేయాలని సూచించారు. ఈ నెల 7 నుంచి 14 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా 7న గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో రంగాచారి, ఆర్డీవోలు మురళీకృష్ణ, రామ్మూర్తి, డీఆర్డీవో మొగులప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పీఎం విశ్వకర్మకు దరఖాస్తుల ఆహ్వానం..**

ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ శివలింగయ్య తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. వడ్రంగి, కమ్మరి, కంసాలి, మోచీ, తాళాల మరమ్మతు వారు, బీట కమ్మరి, అవసలి, కుమ్మరి, మేదరి, ఉప్పరి, ఎరుకలి, బొమ్మలు చేసేవారు, కాలి, మంగళి, దర్జీ తదితర కులాల వారిని ప్రోత్సాహించేందుకు కేంద్రం ఈ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. రూ.లక్షా 50 వేల రుణంతో పాటు రూ.15 వేల టూల్ కిట్ ఇస్తోందన్నారు. ఈ పథకానికి కామన్ సర్వీస్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న వివిధ సంఘాలు, పార్టీల నాయకులు

జనగామ టౌన్, ఫిబ్రవరి 5: గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని మానవ హక్కుల కమిటీ రాష్ట్ర నేత యాసారపు కరుణాకర్, ఓయూ జేఏసీ నాయకుడు తాళ్లపల్లి శివరాంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు రైతులతో కలిసి జనగామ ఆర్టీసీ చౌరస్తాలో రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ గ్రామాల్లో సుమారు పది నెలల క్రితం అకాల వర్షాలతో 42 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు తక్షణ సాయం కింద ప్రకటించి చేతులుదులుపుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. దీక్షలకు ఎంఎస్‌పీ, బీఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఇరుగు యాకన్న, గువ్వల రవి, జేరిపోతుల కుమార్, వివిధ పార్టీల నాయకులు నర్రా నవీన్, కొలిపాక శివరాజ్ తదితరులు సంఘీభావం తెలిపారు.

## 'రాజయ్యను కాంగ్రెస్‌లోకి రానివ్వం'

లింగాలఘణపురం, ఫిబ్రవరి5: కాంగ్రెస్ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలుపొంది ఆ పదవి తనకు చెప్పుతో సమానమని చెప్పిన స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి రానిచ్చేలేదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కీసర దిలీప్‌రెడ్డి అన్నారు. సోమవారం లింగాలఘణపురంలలో ఆయన మాట్లాడుతూ రాజకీయ భవితవ్యాన్ని కల్పించిన కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచిన డాక్టర్ రాజయ్య ఇందిరమ్మ ఇళ్లలో అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు అప్పట్లో బీఆర్ఎస్‌లో చేరారని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దళితబంధు అవినీతిని కప్పిపుచుకునేందుకు కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు పావులు కదుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తల సమ్మతిలేకుండా ఎవరినీ పార్టీలో చేర్చుకునే ప్రసక్తి లేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

**చిలుపూర్:** మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యను కాంగ్రెస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని ఆ పార్టీ చిలుపూర్ మండల ఇన్‌చార్జి తీగల మహేందర్ స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర నేతృత్వంలో ప్రస్తుతం పార్టీ బలోపేతమైందన్నారు. అధిష్ఠానం పార్టీ నాయకులు, కార్యకర్తల మనోభావాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

**రఘునాథపల్లి:** మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జిల్లా నాయకుడు మేకల నరేందర్‌తో కలిసి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల నియామకాల నుంచి దళిత బంధు, బీసీ బంధు తదితర పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం లక్షలాది రూపాయల కమీషన్లు తీసుకున్న రాజయ్య వారి నుండి తప్పించుకోవడానికి అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. ఇక ఆయన రాజకీయాలకు స్వస్తి పలికి వైద్యుడిగా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ శేష జీవితాన్ని గడపాలని హితవుపలికారు.



# తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం

- పొగాకు సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి
- మార్కెట్‌లో క్వింటా ధర రూ.15వేల నుంచి 16 వేలు


ఛాగల్‌లో సాగు చేసిన పొగాకు తోట


రాఘవాపూర్‌లో కొట్టంలో పొగాకు తోరణాలు కట్టిన దృశ్యం

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 5: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అందించే పొగాకు సాగుపై అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. కోతుల బెడద లేకుండా తక్కువ నీటి వినియోగంతో లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. నేల తత్వాన్ని బట్టి ఎకరాకు సగటున 15 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు. ఆరు నెలల్లోనే పంట పూర్తి అవుతుండడంతో స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో రైతులు విరివిగా సాగు చేస్తున్నారు.

**సాగు విధానం..**

పొగాకు సాగు చేసేందుకు హైదరాబాద్‌కు వీఎస్టీ కంపెనీ రైతులకు ఉచితంగా విత్తనాలను అందిస్తోంది. ఎకరాకు 50 నుంచి 100 గ్రాముల గింజలు సరిపోతాయి. ముందుగా భూమి ఉపరితలానికంటే ఒక అడుగు ఎత్తు వరకు 5 అడుగుల నిడివితో 20 అడుగుల పొడవుతో నారుమడిని రూపొందించి గింజలను ఇసుకలో కలిపి నారుమడిలో చల్లాలి. తరువాత 35 నుంచి 40 రోజుల్లో మొక్కలు నాటేందుకు వీలుగా పెరుగుతాయి. కొందరు రైతులు నర్సరీల వద్ద నారును కొనుగోలు చేసుకొని కూడా సాగు చేస్తున్నారు. అప్పటికే సిద్ధం చేసిన దుక్కిలో అచ్చుకొట్టి ఒక అడుగు నిడివితో మొక్కలు నాటాలి. సాధారణంగా యేటా మే, జూన్ మాసంలో పోసుకోవాలి. చల్లని వాతవరణం ఉన్నట్లైతే పొగాకు మొక్కలు ఏపుగా త్వరగా పెరిగే అవకాశం ఉంటుంది. మొక్కలు నాటిన తరువాత సుమారు 40 రోజుల్లోనే లేత పసుపు రంగులోకి మారిన ఆకులను వేరు చేయాలి. వాటిని మహిళ కూలీలతో తోరణాలుగా కట్టించి అప్పటికే ఏర్పాటు చేసిన కొట్టాలలో ఆరబెట్టాలి. ఆకుల పైన ఉన్న కాండం, తొడిమె పూర్తిగా ఎండిన తరువాత తోరణాలను బయటికి తీసి ఉదయం వేళల్లో మండెగా తొక్కి. మండెపైన బరువు వేయాలి. సుమారు 15 రోజుల తరువాత మండెకట్టిన తోరణాలను, మండెనుంచి వేరు చేసి వాటికి ఉన్న దారాలను తొలగించాలి. దారాలను తొలగించిన తరువాత ఆకులను ప్రత్యేకంగా చెక్కలతో రూపొందించిన బేళ్లలో తొక్కి. వాటిని సంబంధిత కంపెనీ సిబ్బందికి అందించాలి.

**తోరణాలు ఏర్పాటు చేయడం నిరంతర ప్రక్రియ...**

మొక్కలు నాటిన 40రోజుల నుంచి లేత పసుపురంగులోకి మారిన పొగాకు ఆకులను మొక్కల నుంచి వేరు చేసి వాటిని తోరణాలుగా ఏర్పాటు చేసే ప్రక్రియ మూడు నెలల పాటు నిరంతరంగా కొనసాగుతుంది.

ఒక్కో మొక్కకు సుమారు 100 నుంచి 150 వరకు ఆకులు వస్తాయి. ఒక్కో మొక్క నుంచి సుమారు రెండు కిలోల వరకు ఆకులు వస్తాయి.

**పెట్టుబడి.. ఆదాయం..**

పొగాకు నారు నుంచి దుక్కి దున్నడం మొదలుకొని మొక్కలు నాటి, ఎరువులు చల్లి మొదట ఆకులు రిలేే వరకు ఎకరాకు రూ.40 నుంచి 50వేల వరకు ఖర్చు వస్తుంది. దీనిపై సగటున 15 క్వింటాళ్ల వరకు పొగాకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.15 నుంచి 18 వేల వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన ఎకరాకు సుమారు రూ.2లక్షల 25వేల ఆదాయం రాగా ఖర్చులు రూ.40వేలు పోగా ఎకరాకు రూ 1.50లక్షల నుంచి 1.75లక్షల మేర రైతులు లాభం పొందుతున్నారు.

**గ్రామాల వారీగా సాగు వివరాలు..**

మండలంలోని అక్కపల్లిగూడెంలో 40-50 ఎకరాలు, రాఘవపూర్‌లో 150 ఎకరాలు, మీదికొండలో 40 ఎకరాలు, శివారెడ్డిపల్లిలో 40 ఎకరాలు, కోమటిగూడెంలో 25 ఎకరాలు, ఇప్పగూడెంలో 80 ఎకరాలు, సముద్రాలలో 25 ఎకరాలు, ఛాగల్‌లో 160 ఎకరాలు, సాగు చేశారు. రఘునాథపల్లి మండలంలోని కురుచపల్లిలో సుమారు 2వందల ఎకరాల మేర పొగాకు సాగు చేస్తున్నారు. గోవర్ధనగిరిలో 60 ఎకరాలు, గబ్బెటలో 40 ఎక రాల మేర సాగు చేశారు. జఫర్‌ఘడ్ మండలంలో 150 ఎకరాలు, పాలకుర్తి మండలంలో సుమారు 120 ఎకరాల మేర పొగాకు సాగు చేస్తున్నారు.

**రఘునాథపల్లి మండలకేంద్రంగా కొనుగోళ్లు...**

హైదరాబాద్ వీఎస్టీ సిగరెట్ కంపెనీకి చెందిన సిబ్బంది రఘునాథపల్లి మండలకేంద్రంలో పొగాకు బేళ్లను కొనుగోలు చేస్తున్నారు. రైతులు పండించిన పొగాకుకు నాణ్యత ప్రమాణాలను బట్టి ధర ఇస్తున్నారు.

**శ్రమకు తగిన ఫలితం వస్తోంది...**



**కాసాని స్వప్న, మహిళ రైతు, రాఘవపూర్**

శ్రమ ఉన్నప్పటికీ అదే స్థాయిలో లాభాలు వస్తున్నాయి. నాలుగు నెలల పాటు పని ఉంటుంది. మిగితా పంటల మాదిరిగా కాకుండా పొగాకు సాగుకు తక్కువ పెట్టుబడి అవుతుంది.. చీడపీడలు, కోతులు పంటను దరిచేరవు. కొనుగోలు కేంద్రాలను విస్తరిస్తే అధికలాభాలు పొందవచ్చు.

**పొగాకు సాగు రెట్టింపు అయ్యింది...**



**చంద్రన్‌కుమార్, వ్యవసాయ అధికారి**

గతంతో పోల్చుకుంటే ఈసారి పొగాకు సాగు రెట్టింపైంది. మార్కెట్‌లో పొగాకుకు రేటు భారీగా పెరిగింది. అంతేకాకుండా గ్రామాల్లో కోతుల బెడద ఉండదు. వరి, ఇతర పంటలకు ప్రత్యమ్నాయంగా రైతులు పొగాకు పై దృష్టి పెట్టారు.

## చట్టసభల్లో బీసీల వాటా సాధించుకోవాలి

- ఆల్‌ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్


పాలకుర్తిలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బాధ్యులు

పాలకుర్తి, ఫిబ్రవరి 5: జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలు తమ వాటాను చట్టసభల్లో సాధించుకునేందుకు బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన పాదయాత్ర సోమవారం పాలకుర్తికి చేరింది. ఈ సందర్భంగా వారు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆల్ ఇండియా జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ సమాజంలో బీసీలు అత్యధిక శాతం మంది ఉన్నారని, ఎంత మంది బీసీలు ఉన్నారో అన్ని సీట్లకు కేటాయింపులు జరగాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో బీసీలకు సమాన అవకాశాలు కల్పించాలని, సరైన గౌరవం దక్కేలా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో ఓబీసీ వైస్ చైర్మన్ పటేల్ వనజ, కమ్మగాని పరమేశ్వర్ గౌడ్, బత్తుల సిద్దేశ్వర్, అరుణక్క, రామారెడ్డి, రామనర్సయ్య పాల్గొన్నారు.

**దేవరుప్పుల:** దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో చట్టసభల్లో బీసీల వాటా సాధిస్తామని ఆల్‌ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. ఆయన తలపెట్టిన మహాపాదయాత్ర సోమవారం కడవెండికి చేరుకుంది. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య స్మారక విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభల్లో వాటా ద్వారానే సకల సామాజిక రంగాల్లో న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా ఒబీసీ వైస్ చైర్మన్ పటేల్ వనజ, వెలుగు వనిత నాయకులు చాపర్తి కుమార్‌గాడ్గే, ఏటిగడ్డ అరుణక్క, సూరారపు రమారెడ్డి, బత్తుల రామనర్సయ్య, కొంగర నరహరి, దుబ్బకోటి ఆంజనేయులు, కె.విజయకుమార్, పర్వత సతీష్ కుమార్, పరికిపండ్ల అశోక్, పైండ్ల వెంకటరమణ, కామునిపెల్లి నరసింహాచారి, సుడిగెల హన్మంతు, తాటిపెల్లి మహేష్ పాల్గొన్నారు.

## 'లహరి' స్లీపర్ బస్సులను ప్రారంభించిన మంత్రులు


మేడారంలో బస్సులను ప్రారంభిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క

ములుగు, ఫిబ్రవరి 5: ఆర్టీసీ సంస్థ నూతనంగా కొనుగోలు చేసిన నాలుగు 'లహరి' నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులను రాష్ట్ర రవాణ శాఖామంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, గ్రామీ ణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సోమవారం ప్రారంభించారు. మేడారంలోని తాత్కాలిక బస్టాండు వద్ద వీటికి జెండా ఊపారు. డ్రైవర్లను మంత్రి పొన్నం అభినందించారు. వరంగల్-2 డిపో పరిధిలో హనుమకొండ- విశాఖపట్నం రూట్‌లో ఈ బస్సులు నడిపించనున్నారు. ప్రతీరోజు సాయ ంత్రం 3 గంటలు, 5 గంటలకు బస్సులు బయలుదేరుతాయని డిపో మేనేజర్ జి.సురేష్ తెలిపారు. 48సీట్ల సామర్థ్యం కలిగిన ఈ బస్సులలో 33 సీటింగ్ సీట్లు, 15స్లీపర్ బెర్త్‌లు ఉంటాయని తెలిపారు. సీసీ కెమెరా, టైమర్ సదుపాయం కల్పించామని చెప్పారు.

ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని, బస్టాండులోని కౌంటర్‌లో కూడా టికెట్ తీసుకునే వీలుందన్నారు. ఈ బస్సులు ములుగు, ఏటూరునాగారం, మంగపేట, మణుగూరు మీదుగా విశాఖపట్నం వెళ్తాయని వివరించారు. ఈ అధునాతన బస్సులలో 556కిలోమీటర్ల దూరం ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఖచ్చితమైన సమయానికి గమ్యస్థానానికి చేర్చడం జరుగుతుందన్నారు.

# విద్యార్థులే ప్రజాప్రతినిధులుగా..

- ఆకట్టుకున్న నమూనా జడ్పీ సర్వసభ్య సమావేశం


నమూనా జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న కస్తూర్బా విద్యార్థులు

కొడకండ్ల ఫిబ్రవరి 5 : మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విదార్థులు సోమవారం నమూనా జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ అనే విషయంపై చర్చించారు. విద్యార్థులే జడ్పీ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా, జడ్పీటీసీలుగా, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులుగా వ్యవహరించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ మేడారం సమ్మక్క జాతరను ప్లాస్టిక్ రహితంగా నిర్వహించి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. వ్యక్తిగత, ప్రైవేట్ వాహనాలలో రాకుండా సాధ్యమైనంత మేరకు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవడం వల్ల వాయుకాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. జంతు వ్యర్థాలను చెత్తకుండీలలో వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అధికారులు సంయమనంతో విధులు నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని సూచించారు. అందరూ సహకరిస్తే సాధ్యమైనంత వరకు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని వారు కోరారు. ఈ సందర్భంగా ఇంచార్జి స్పెషల్ ఆఫీసర్ శారద మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయ బృందం పర్యవేక్షించింది.

## కౌన్సిలర్ శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే పల్లా పరామర్శ

జనగామ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జనగామ మునిసిపల్ పరిధి 21వ వార్డు కౌన్సిలర్ కర్రె శ్రీనివాస్ తండ్రి కర్రె కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం అక్కడకు చేరుకొని కొమురయ్య చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం కౌన్సిలర్ శ్రీనివాస్ ను పరామర్శించి మనోధైర్యం నింపారు.

## రగ్బీలో చాంపియన్‌గా నిలిచిన జిల్లా జట్టు


ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా ప్రథమ బహుమతి ట్రోఫీని అందుకుంటున్న జనగామ జిల్లా జట్టు

పాలకుర్తి, ఫబ్రవరి 5: ఈ నెల 3,4 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలోని కాసారం గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 14 విభాగంలో రగ్బీ చాంపియన్ షిప్ పోటీలలో జనగామ జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు దొంతమల్ల గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో 30 బాలుర జట్లు పాల్గొన్నాయని, వాటిలో జనగామ జిల్లా బాలుర జట్టు ప్రతిభ చూపి చాంపియన్‌గా నిలిచి జిల్లాకే వన్నె తెచ్చిందని అన్నారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా మెమోంటోను నగదును ఈ జట్టు అందుకుందని తెలిపారు. ఈ సందర్భంగా జనగామ రగ్బీ జట్టును పలువురు అభినందించారు.

## సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం


దేవరుప్పులలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

దేవరుప్పుల, ఫిబ్రవరి 5: ఆరు గ్యారెంటీల అమలుకోసం 100రోజులు సమయం తీసుకున్నప్పటికీ ముందుగానే రెండు గ్యారెంటీలపై క్యాబినెట్ తీర్మానం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ దేవరుప్పుల చౌరస్తా వద్ద సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రజలకు హామీలు ఇస్తే విస్మరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తుందన్నారు. రూ.500కు వంటగ్యాస్, 200యూనిట్ల విద్యుత్‌ఫ్రీ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూక్యా సజ్జన్, మహేందర్, రెడ్డిరాజుల రమేష్, ఉప్పుల అనిల్. పారుపెల్లి శ్రీనివాస్, చింతల రవీందర్‌రెడ్డి, కొండ మల్లారెడ్డి, ధరావత్ రవీందర్, వరికెల రతన్, పులిపంపుల భాస్కర్, ప్రవీణ్, యాకన్న, దేవానాయక్, పుల్లయ్య, వెంకన్న, నిఖిల్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు

నర్మెట, ఫిబ్రవరి 5 : మండలంలోని మచ్చుపహడ్ గ్రామంలో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారికి ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు కోసం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా ఆన్‌లైన్ ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహరెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు పట్టభద్రుల వదక్కు వెళ్లి ఓటు నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి. కుమారస్వామి, పరీదుల యాదయ్య, గొల్లపల్లి అంజయ్య, భూక్య జయరాం జడల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సాయిప్రసాద్ (ఫైల్)

చిలుపూర్, ఫిబ్రవరి 5: మండలంలోని వంగాలపల్లి సమీపంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో నష్కల్ గ్రామానికి చెందిన మేరుగు సాయిప్రసాద్ (29) అనే యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫొటోగ్రాఫర్‌గా పనిచేసే సాయిప్రసాద్ ఆదివారం రాత్రి కాజీపేట మండలం వనమాల కనపర్తిలో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి వెళ్లి అర్ధ రాత్రి దాటిన తర్వాత బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టాడు. సమాచారమందుకున్న కుటుంబసభ్యులు 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. ఆయనకు భార్య శ్రీవాణి ఉన్నారు. తండ్రి భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ తెలిపారు.

కాగా, బాధిత కుటుంబాన్ని జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు కర్ణకంటి నాగరాజు, కుమార్, కీర్తి ప్రవీన్ తదితరులు సందర్శించారు. సాయిప్రసాద్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. తక్షణ సాయంగా రూ 10 వేల నగదు అందజేశారు.

## మోపెడ్‌ను ఢీకొట్టిన లారీ

**ఒకరికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం**


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నర్సయ్య

జనగామ టౌన్, ఫిబ్రవరి 5: జనగామ ఆర్టీసీ చౌరస్తాలో మోపెడ్‌ను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాల య్యాయి. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. లింగాలఘణపురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మరాఠి నర్సయ్య అనే వృద్ధుడు సోమవారం తన మోపెడ్‌పై జనగామకు వచ్చి వెళ్తుండగా ఆర్టీసీ చౌరస్తాలో ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడడంతో ఆగాడు. గ్రీన్ సిగ్నల్ పడ్డాక ముందుకు వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో నర్సయ్య కింద పడ్డాడు. అతడి కుడి చేయి పైనుంచి లారీ వెళ్లడంతో సగం చేయి నుజ్జునుజ్జయింది. వెంటనే ఆయనను జిల్లా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గాంధీకి పంపించారు. ఎస్సై తిరుపతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వాహనం ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 5: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని ఆలేరు-కొలనుపాక రోడ్డు మార్గంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన ఎం.శ్రీకాంత్ తన ద్విచక్ర వాహనంపై కొలనుపాకకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఆలేరు నుంచి సిద్దిపేటకు వెళ్లే రహదారిలో తుపాన్ వాహనం ఢీ కొట్టింది. దీంతో శ్రీకాంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆలేరులోని ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

## మానవత్వం చూపిన పోలీసులు

**గాయపడిన వృద్ధురాలిని తమ వాహనంలో ఆస్పత్రికి తరలింపు**

బచ్చన్నపేట, జనవరి 5: ఆపద సమయంలో ఆదుకునే గుణం తమలో మెండుగా ఉంటుందని పోలీసులు మరోమారు రుజువు చేశారు. ద్విచక్ర వాహనం పైనుంచి పడి గాయాలపాలైన వృద్ధురాలిని అంబులెన్స్ రావటం ఆలస్యమవుతుందని భావించి తమ వాహనంలో తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించారు. మండలంలోని మన్‌షాన్‌పల్లి గ్రామానికి చెందిన గీస యాదలక్ష్మీ- సత్యనారాయణ ద్విచక్ర వాహనంపై బచ్చన్నపేటకు వస్తుండగా నక్కవాని గూడెం వద్ద వెనుక కూర్చున యాదలక్ష్మీ కిందపడి గాయపడింది. అదే సమయంలో అటువైపుగా వెళుతున్న నర్మెట సీఐ సాయిరమణ, బచ్చన్నపేట ఎస్ఐ సతీష్ వాహనం ఆపి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే తమ వాహనంలో తీసుకెళ్లి బచ్చన్నపేట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఈ సందర్భంగా వారిని పలువురు ప్రశంసించారు.

## నేడు చింతగట్టు జాతర వేలం పాటలు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 5: మండలంలోని ఇప్పగూడెం, కోమటిగూడెం, రంగరాయగూడెం, అక్కపల్లిగూడెం గ్రామాల పరిధిలోని చింతగట్టు సమ్మక్క-సారలమ్మ జాతరలో వివిధ వస్తువులను విక్రయించే హక్కులు పొందడానికి గాను ఈ నెల 6వ తేదీన జాతర ఆవరణలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు జాతర కార్యనిర్వహణ అధికారి లక్ష్మీప్రసన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1) బంగారం, కొబ్బరికాయలు, కుంకుమ పసుపు అమ్ముకొను హక్కు, 2) కూల్ డ్రింక్స్ అమ్ముకొను హక్కు, 3) కోళ్లు అమ్ముకొను హక్కు, 4) తలనీలాలు పోగు చేసుకొను హక్కులు పొందడానికి గాను బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలను 6వ తేదీ ఉదయం 11గంటల నుంచి ఒకదాని తరువాత ఒకటి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు కొబ్బరికాయలకు రూ.20వేలు, కూల్‌డ్రింక్స్‌కు రూ.25వేలు, కోళ్లకు రూ 25వేలు, తలనీలాలకు రూ.10వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. వేలంపాటలో హక్కులు పొందిన వారు ఈ నెల 7వ తేదీ నుంచి 29వ తేదీ వరకు మాత్రమే హక్కులను కల్గి ఉంటారని తెలిపారు. గతంలో వేలంపాటలో పాల్గొని డబ్బులు చెల్లించని వారికి ఈసారి అవకాశం లేదన్నారు.

## త్రోబాల్ పోటీలకు ఇప్పగూడెం యువకుడు


లోడెంగుల శివరాజ్

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 5: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన లోడెంగుల శివరాజ్ అనే యువకుడు జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 45వ తెలంగాణ సీనియర్ త్రోబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పీఈటీ ప్రమోద్ రెడ్డి తెలిపారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో శివరాజ్ పాల్గొంటాడని వివరించారు.